కామెడీ కథ

# కోదండం కో...దండం...!!

**అదిగో..అప్పుడే..సరిగ్గా ఆ సమయంలోనే చిదానందానికి ఆ కోరిక వానపాములా సన్నగా మొదలై క్రమేపీ అనకొండలా పెరిగి బుసలు కొట్టసాగింది.**

**చిదానందం చిన్న సైజు కథారచయిత. చిన్నప్పట్నుంచీ అన్ని రకాల పత్రికలూ చదువుతూ అవి బాగున్నాయి, ఇవి బాగున్నాయి అని ఉత్తరాలు రాస్తూ ఉత్తరాల రచయితగా ప్రారంభించి, ఐదారేళ్ళు తిరిగేసరికి చిన్న కథారచయిత అనిపించుకున్నాడు.**

వివిధ పత్రికల్లో అనేక కథలు చదివి ఒంట పట్టించుకున్న చిదానందం ఇప్పుడు తనో కథా రచయితనని చెప్పుకోవడానికెంతో సంబరపడిపోతాడు. ఇన్నాళ్ళుగా సాహిత్యంలో అతగాడు చేసిన కృషికి అడపాదడపా చిన్నా చితకా కథలు ప్రచురించబడి ఫలితం మూడు మెచ్చుకోళ్ళు, ఆరు గుర్తింపులుగా సాగిపోతోంది చిదానందం రచనా జీవితం.

అలాంటి చిదానందానికి ఉన్నట్టుండి కొత్తగా ఓ కోరిక కలిగింది. ఆ కోరిక అకస్మాత్తుగా అతని అర్ధాంగి మాటల్లోంచి పుట్టింది. అదెలాగయ్యా అంటే ''ఎప్పుడూ ఆ కథలూ కాకరకాయ లేనా..కాస్త నన్ను పట్టించుకునే దేమైనా వుందా..ఈరోజు ఎలాగైనా 'నా నీడ..నీ పీడ' సిన్మాకి తీసుకెళ్ళాల్సిందే. వీధిలో అంతా చూసి గొప్పగా చెప్పుకుంటున్నారు. నేనింకా చూడలేదంటే తల కొట్టేసినట్లయ్యింది'' అంటూ గద్దించేసరికి ''సరే'' అన్నాడు. తీరా సిన్మా చూసి ''ఛట్ ఇదేం సిన్మా...ఉత్త చెత్త సినిమా. ఎంత దరిద్రంగా వుంది. దీని కన్నా మీరు కథ రాసుంటే బ్రహ్మాండంగా ఉండేది'' అంటూ చిదానందం భార్య చంపకం యథాలాపంగా అనేసింది. అదిగో అప్పుడే చిదానందానికి ఆ కోరిక వానపాములా సన్నగా మొదలై క్రమేపీ అనకొండలా పెరిగి బుసలు కొట్టసాగింది.

ఏది ఏమైనా సినిమాలకు కథలు రాయాలని తీర్మానించుకున్నాడు చిదానందం. సినిమాల్లో అయితే బోలెడు డబ్బొస్తుంది. ఎంతో పేరొస్తుంది. చంపకం చెప్పినట్లు ఈపాటి కథలు తను సృష్టించలేడా. తన బుర్రలో ఎన్ని థీమ్స్ లేవూ?

ఈ ఆలోచన రాగానే అదే పనిగా బుర్ర బద్దలుగొట్టుకొని ఏం చేయాలా అని సతమతమవుతున్న సమయంలో ఒకరోజు 'మర్నాడు' దినపత్రికలో పడిన ఓ ప్రకటన చిదానందాన్ని చాలా ఆకర్షించింది. కోట్లకు పడగెత్తిన సినీ నిర్మాత కోదండం ఇచ్చిన ప్రకటన అది. దాని సారాంశం ఏమిటంటే...

'సినిమాకు కథ కావలెను'

తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టిన దగ్గర్నుంచి ఇప్పటిదాకా విసుగూ విరామం లేకుండా నేను తీసిన 70 సినిమాలని ఎంతోమంది ప్రేక్షకులు ఆదరించారు. అన్నీ విజయవంతమైన చిత్రాలే. నా మొదటి సినిమా 'తిక్కలోడు' మొదలుకొని నా 70వ సినిమా 'తింగరోడు' దాకా ఎన్నో సూపర్ హిట్లు తీసాను. చిత్రసీమలో మా సంస్థ ఆహో..ఓహో యూనిట్ రజతోత్సవంలోకి వచ్చిన సందర్భంగా ఇక ముందు మరికొన్ని ప్రతిష్టాత్మక సినిమాలు తీయాలనే ఉద్దేశ్యంతో మంచి వైవిధ్యమైన కథకోసం ఈ ప్రకటన చేస్తున్నాను.

కాబట్టి నేను తీయబోయే 71వ చిత్రానికి చక్కని కథ చెప్పమని ఆంధ్రదేశం నలుమూలల నుంచి కొత్త రచయితలను ఆహ్వానిస్తున్నాను. మంచి కథ వినిపిస్తే ఎన్ని కోట్లయినా ఖర్చుపెట్టి సినిమా తీస్తాను. కేవలం కొత్త రచయితలే ఇందుకు అర్హులు. ఇప్పటికే మీరు పేరుపొందిన ప్రఖ్యాత రచయితలైతే ఈ ప్రకటన మీకోసం కాదు. కొత్తవారిని ప్రోత్సహించి అవకాశం ఇవ్వాలనే ఈ ప్రయత్నం. కావున రచయితలారా..ఈ అవకాశం సద్వినియోగం చేసుకోండి. ఫలానా తారీఖున ఫలానా రోడ్డులో నన్ను కలవండి.

ఇట్లు
కోదండం (సినీ నిర్మాత)
ఆహో ఓహో యూనిట్
టోకరా హిల్స్..రోడ్‌నెం..9
హైదరాబాద్-420

అంతే, ఈ అవకాశం తన కోసమే వెతుక్కుంటూ వచ్చిందని ఎగిరిగంతేసాడు చిదానందం. తన కథ తెరపై సినిమాగా వచ్చేసినట్లేనని పరమానందపడిపోయి ఆ ప్రకటన కట్ చేసి భద్రంగా దాచుకున్నాడు. నిర్మాత కోదండంని కలవడానికి యింకా 20 రోజుల వ్యవధి వుంది. ఈలోగా మహత్తరమైన కథల్ని కనీసం ఓ అరడజనైనా తయారుచేసుకోవాలి అనుకుంటూ తాను చేస్తున్న ఉద్యోగానికి నెలరోజులు లీవు అడిగాడు.

''నువ్వు చేస్తున్నదే బోడి టెంపరరీ ఉద్యోగం. ఎప్పుడు పీకేస్తామో నీకే కాదు నాకూ తెలియదు. అలాంటిది ఏకంగా 30 రోజులు సెలవా? ఏం వేళాకోళంగా వుందా..టాట్..ఛస్తే కుదరదు పో..పోయి పని చూడు..పోపో'' అన్నాడు చిదానందం పనిచేసే కంపెనీ మేనేజర్ కోపంగా.

''సార్..అంత మాటనకండి సార్. నా బతుక్కో బంగారు ఛాన్సు. కాదనకండి'' అంటూ దభాల్న కిందపడి బాస్ రెండు కాళ్ళూ గభాల్న పట్టేసి కళ్ళు నీళ్ళెట్టుకున్నాడు చిదానందం.

చిదానందం కిందపడి అమాంతం రెండు కాళ్ళూ చిన్నపిల్లాడిలా అలా పట్టేసుకొని కాళ్ళకు అడ్డంపడి కన్నీళ్ళతో ప్రాధేయపడేసరికి గుండె తరుక్కుపోయి జాలిపడి కథలమీద చిదానందానికున్న విపరీతమైన మక్కువకు ముక్కున వేలేసుకొని 'ఇతను గొప్ప సినీ కథారచయిత అయితే మన కంపెనీకే కదా పేరు. పైగా దీనికి మేనేజర్ తానేనాయె. ఆ క్రెడిట్ తనకూ కాస్తో కూస్తో అంటుకుంటుంది. పైగా ఇప్పుడు తమ లుక్కుటపా బిస్కట్ల కంపెనీ అసలే లాసులో వుందాయె. ఈ చిదానందం క్రికెట్‌లో చిచ్చరపిడుగు సచిన్ టెండూల్కర్‌లా సినిమాల్లోకెళ్ళి పేరు తెచ్చుకుంటే ఆ గొప్పతనం వల్ల తమ కంపెనీ లాభాల్లో పడితే తనకు ప్రమోషన్ గ్యారంటీ'' అని కడు దూరదృష్టితో ఆలోచించి సమాధానపడి-

''సర్లేవోయ్..అలాగే. కానీ..కానీ..''

''కానీ ఏంటి సార్..పర్లేదు చెప్పండి'' పైకి లేస్తూ అడిగాడు చిదానందం.

''మన హెడ్డాఫీసు అన్ని రోజులు లీవు శాంక్షన్‌కు ఒప్పుకోదేమో నోయ్''

''అమ్మమ్మా..అలాగనకండి సార్. మీరు తల్చుకుంటే ఎంతసేపు..చిటికెలో పని''

''సర్లే..సర్లే..సాయంత్రం ఓ కేజీ స్వీటూ రెండు కేజీల హాటూ పట్టుకెళ్ళి మేడమ్‌గారికిచ్చేసిపో''

''అలాగే సార్..అదెంత భాగ్యం''

★ ★ ★

గత ఇరవై రోజులుగా కంటికి కుదురైన నిద్ర కడుపునకు కమ్మని తిండి లేకుండా ఇరవై నాలుగ్గంటలూ కథలకోసం ఆలోచించి ఆలోచించి ఒంట

రిగా తన గదిలో వుండిపోయాడు చిదానందం. మామూలుగా అన్ని పనులు తనే చేసుకుంటున్నా భర్త ఇరవై రోజులుగా ఆ గది దాటి బయటికి రాకుండా పైగా తలుపులు బిగించుకొని లోపల ఏమైపోయాడోనని చంపకం గుండెలు బాదు కుంది. పిల్లలు ఘొల్లుమన్నారు.

''హేమండీ..నన్ను అన్యాయం చెయ్యకండీ'' అంటూ చంపకం శోకాలు పెట్టేసరికి..

''అబ్బ..ఏమిటో నీ గోల'' అని చిరాకుపడ్తూ తలుపు తెరిచిన చిదానందాన్ని చూసి పిల్లలు ఒక్కసారిగా బెదిరి ఝుడుసుకుని భయంగా చంపకం వెనుక చేరి తల్లిని కరుచుకుపోయారు.

చంపకం తన కళ్ళను తానే నమ్మలేకపోయింది కారణం..చిదానందం అవతారం పూర్తిగా..గుర్తు పట్టలేనంతగా మారిపోయింది. తలకాయ తిరుపతి గుండు గీసినంత నున్నగైపోయి తళతళా మెరుస్తూ..అంతకు ముందు నెత్తిమీద ఒత్తుగా వున్న జుత్తంగా పొడవుగా గడ్డం స్థానంలోకి చేరి ఆనవాలు పట్టలేనంతగా మారిపోయాడు.

కావలించుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్న చంపకం చంపలు అనునయంగా తట్టి ''ఎందుకే పిచ్చి దానా..ఏడుస్తావు. ఇప్పుడు గదా నా రూపం సార్థక మయ్యింది. సింహాచలం అప్పన్న నిజరూప సందర్శనంలా సినీ రచయిత అసలు రూపం ఇదే. మెరిసే బోడిగుండు చుట్టూ కాసింత పల్చని జుట్టు..పిచ్చికగూడులాంటి ఈ బారెడు గడ్డం..వాహ్..నా కల నిజమయ్యింది. అదిగో నా తల్లి సినీ కళామతల్లి రారమ్మని నన్నే పిలుస్తోంది. పిల్లలు జాగ్రత్త..వెళ్ళొస్తా'' అంటూ అనకాపల్లి వెళ్ళి గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కేసాడు చిదానందం. ఎన్నో ఆశలతో స్పెషల్‌గా కుట్టించుకున్న కుర్తాపైజమాతో భుజాన ఓ సంచి వేలాడేసుకుని కొత్తగా కొన్న కళ్ళజోడు పెట్టుకుని...అచ్చు పదహారణాల తెలుగు కథా రచయితలా.

★ ★ ★

రైలు దిగి రాజధానిలోకి అడుగుపెట్టిన చిదానందానికి తొలిసారి ఆ మహానగరాన్ని చూడ్డగానే శరీరం పులకించగా..''ఆహా నేను సినీ రచయిత్నై నా కథలన్నీ సినిమాలై..సూపర్‌హిట్ అయితే చంపకం..పిల్లల్తో కలిసి సెటిలయ్యేది ఈ భాగ్యనగరం నేలమీదే కదా..ఏమి నా భాగ్యం'' అని మురిసిపోతూ-

''ఏయ్ ఆటో..వస్తావా'' అంటూ కేకేసాడు తనవైపే పరిశీలనగా చూస్తూ వస్తున్న డ్రైవర్‌ని.

''ఎందాకా పోవాల్నసాబ్?''


''ధుమకు ధమా లాడ్జి..తెలుసా''

''ఓ..తెల్వకేనేం సాబ్..డింగులకా సినిమా థియేటర్ వెనుక వుంది''

''పోనియ్యి'' అన్చెప్పి ఆటోలో కూర్చున్నాడు చిదానందం.

గట్టిగా చంకలు గుద్దుకుంటూ ''భలే బేరం'' అని సంబరపడుతూ ''అలాగే సాబ్'' అంటూ



డ్రైవర్ ఆటో స్టార్ట్ చేసాడు. ఆటో రయ్యుమని దూసుకుపోయి ఒక పది నిమిషాల్లోనే ఆగిపోయింది.

''ఏమయ్యిందయ్యా..అప్పుడే ఆపేసావేం''

''ట్రాఫిక్ జామ్ సాబ్..ఇక ఆటో ఒక్క అంగుళం కూడా ముందుకు కదలదు.''

''ఏం?''

''ఒక్కసారి అటు చూడండి. ఎంత పెద్ద క్యూలు వున్నాయో. ఈ జనమంతా ధమకు ధమా లాడ్జి వరకూ ఇసికేస్తే రాలనంతగా మూగారు. కాబట్టి మీరు దిగి నడిచి వెళ్ళడమే ఉత్తమం. నా ఆటో ఛార్జి వంద రూపాయలూ ఇచ్చి దిగండి'' ఇక ఎంత మాత్రమూ ముందుకెళ్ళేది లేదని తేగేసి చెప్పినట్టు చెప్పాడు ఆటోవాలా.

''అదేంటయ్యా. మరీ ఈమాత్రం దూరానికి వంద రూపాయలా..అందులోనూ చేర్చవలసిన దగ్గరికి చేర్చకుండానే''

''నా తప్పేం లేదండి. జనం ఇలా అడ్డుంటే అక్కడిదాకా ఎలా తీసుకెళ్ళగలను. చూశారా..కార్లులూ..బస్సులూ..అన్నీ ఇక్కడే ఆగిపోయాయి'' అంటూ చిదానందం పర్సు తీసి డబ్బు లెక్క పెడుతుంటే చేతిలోని వందకాగితం లాక్కుని ఆటో రివర్సు చేస్తూ...''ఇవాళ లేచిన వేళా విశేషం ఏమిటో గానీ..భలే గిరాకీ పొద్దుట్నుంచీ..ఈ జనాల్లో సగం మందిని తనే స్టేషన్నుంచి తీసుకొచ్చాడు. అసలు అర్థరాత్రి నుంచీ ఒకటే జనం..జనం..'' అనుకుంటూ హుషారుగా వెళ్ళిపోయాడు ఆటోవాలా మరో బేరం కోసం.

చిదానందం భుజాన సంచి సరిచేసుకుని ముందుకు నడిచి ఇక్కడెందుకు ఇంతమంది క్యూలు కట్టుకొని వున్నారో తెలుసుకోవాలనే ఆసక్తితో క్యూలో చివర్న వున్న గిరజాల జుత్తు ఆసామిని పలకరించాడు.

''అయ్యా..నేను ధమకుధమా లాడ్జికెళ్ళాలి.

గూటూరి వెంకటేశ్వరరావు

కానీ..వీళ్ళంతా అడ్డుగా వున్నారు. ఎలా వెళ్ళాలో దారి తెలీడం లేదు. అసలు వీళ్ళంతా ఎవరు? ఏ పనిమీద వచ్చారు? మీరు కూడా ఈ క్యూలో దేనికి నుంచున్నారు''

ఆ ఆసామి చిదానందాన్ని ఎగాదిగా చూసి-

''మీకు తెలియకే అడుగుతున్నారా..ఈ క్యూ అంతా ఆ లాడ్జిలోకెళ్ళడానికే. ఆ లాడ్జిలో పేరు పొందిన పెద్ద నిర్మాత కోదండంగారున్నారు. వారికి కథలు వినిపించాలని వచ్చిన కథారచయితలమే మేమంతా''




ఆ..అంటూ నోరు ఆవలించి ఢామ్మని మూర్ఛపోయాడు చిదానందం. వెంటనే క్యూలో కలవరం..గిరజాల జుత్తు ఆసామి తన వాటర్ బాటిల్లోంచి నీళ్ళు తీసి చిదానందం ముఖం మీద జల్లాడు. చిదానందం నెమ్మదిగా తేరుకున్నాడు. తేరుకుని తనని తేరిపార చూస్తున్న జనం వంక ఒకసారి చూసి పైకి లేచాడు.

''ఇంతమంది కథారచయితలా. వార్నాయనోయ్..వీళ్ళ కథలన్నీ విని నా వంతు వచ్చి నా కథలు విన్పించేసరికి ఎంత కాలం పడ్తుందో కదా!'' స్వగతంగా అనుకోబోయి పైకే అనేసాడు చిదానందం.


''అదీ అలా చెప్పండి. మీరు కూడా రచయితేనన్నమాట..రండి..రండి..నా వెనక నిల్చోండి. లేకపోతే క్యూ ఇంకా పెరిగిపోయేలా వుంది'' గిరజాల జుత్తు ఆసామి సాదరంగా స్వాగతం పలికాడు చిదానందానికి.

చేసేది లేక చిదానందం అతని వెనుక నిల్చున్నాడు. సినిమా రచయిత కాబోయేవారికి ఆమాత్రం సహనం ఓర్పు వుండాలని సర్ది చెప్పుకున్నాడు ఉస్సురంటున్న మనసుకి. లైను కదులుతున్నా..కదులుతున్నట్టే లేదు. మధ్యాహ్నం ఒంటి గంట దాటి రెండు కావొస్తోంది. చిదానందానికి ఆకలి దంచేస్తోంది. క్యూలోని జనమంతా అనకాపల్లి నూకాలమ్మ జాతరకొచ్చినట్లు అక్కడే వంటలు వండేసుకుని భోజనాలు కానిచ్చేస్తున్నారు. కొందరు టిఫిన్ బాక్సులు ఓపెన్ చేసి మరికొందరు హోటళ్ళ నుంచి క్యారేజ్‌లు తెప్పించుకుని (ఈ ఏర్పాటు అక్కడి చుట్టు పక్కల హోటళ్ళ యజమానులు తమ తమ మెస్సెంజర్ల ద్వారా చేసారని గమనించవలెను) ఆకలి తీర్చుకోసాగారు. చిదానందానికేమీ పాలుపోలేదు. ఇలాంటి వాళ్ళకోసమా అన్నట్లు ''ఇడ్లీ..వడ..ఛాయ్..పెరుగన్నం..మజ్జిగ..పూరీ'' అంటూ అమ్మేవాళ్ళు బయల్దేరారు. ''హమ్మయ్య'' అనుకుంటూ ఇడ్లీవడ తిని ఓ వాటర్ పేకెట్ కొనుక్కొని నీళ్ళు తాగి తన ఆకలి బాధ తీర్చుకున్నాడు చిదానందం.

అప్పటికే చాలాసార్లు గమనించాడు చిదానందం. తనకు కాస్త దూరంలో ఖద్దరు బట్టలేసుకున్న..పంచెకట్టుతో తమాషాగా వున్న ఓ వ్యక్తిని. గాల్లో చేతులు వూపుతూ..తనలో తానే ఏదో మాట్లాడుతూ..మాటి మాటికీ చేతులు రెండూ ఆడిస్తున్నాడు. చిత్రంగా అనిపించి తన ముందున్న గిరజాల జుత్తు ఆసామిని అడిగాడు చిదానందం.

''ఏంటండీ...ఆ నడివయసాయన. చీటికీ మాటికీ చేతులు రెండూ గాల్లో తిప్పుతూ తనలో తనే గట్టిగా గొణుక్కుంటున్నాడు''

''ఓ..అదా సంగతి..నా ముందాయన చెప్పిన దాన్ని బట్టి అతనో చెయ్యి తిరిగిన రచయితట. పుంఖానుపుంఖాలుగా రాసి పడేసాడట కథలు. కానీ ఏవీ ఏ పత్రికల్లోనూ ఇప్పటిదాకా ప్రచురణకాలేదట. ఇప్పుడు ఈ సినిమా అవకాశం పరీక్షించుకుందామని ప్రకటన ఆలస్యంగా చదివి పరుగు పరుగున అంబాజీపేట నుంచి పారిపోయి వచ్చాడట..తన కథల్లో ఏ కథ సినిమాకి సూటవుతుందా అని స్టడీ చేస్తూ..ఓ కొత్త కథ అల్లుతున్నాడన్నమాట''




''ఏడ్చినట్టే వుంది'' అని నాలుక్కరుచుకుని 'ఏమో ఏ పుర్రెలో ఏ ధీముందో కదా' అని నిట్టూర్చాడు చిదానందం.

మహిళామణుల క్యూలు కూడా విపరీతంగా పెరగడం గమనించిన చిదానందానికి క్రమేపీ పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటవడం ఆశ్చర్యం వేసింది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఆంధ్రాలోని మారు మూలల నుంచి ఈ సందర్భంగా స్పెషల్ రైళ్ళు కూడా తిప్పడం ప్రారంభించారంట. వామ్మో ఈ లెక్కన నేను కాస్త ముందుగానే మేల్కొన బట్టి సరిపోయింది. లేకపోతే తన కథలు వినిపించేసరికి ఏ వారమో పట్టేదేమో. ఎందుకంటే అప్పుడే తన వెనుక లైను టీవీలో అంతం లేని డైలీ సీరియల్లా పెరుగుతూనే వుంది. ఇంతమంది చెప్పే కథలన్నీ విని తట్టుకోగలిగే శక్తి వుండడం..నిజంగా నిర్మాత కోదండంగారి గొప్పదనమే.

ఇంతలో చివరి వరస క్యూలో ఏదో గొడవ. పోలీసులు అటు వెళ్ళారు. మేటరేంటయ్యా అంటే ఓ కుర్ర రచయిత తన కథని ఎవరో సంచిలోంచి కొట్టేశారని గోల. పోలీసుగస్తీ ముమ్మరం అయ్యింది.


ఇలా ఎంతోసేపు ఎన్నో గంటలు నిల్చున్నాక మరుసటి రోజు రాత్రి తొమ్మిది గంటలకు చిదానందానికి అవకాశం దొరికింది. లాడ్జి గదిలోకి వెళ్ళిన చిదానందాన్ని నిర్మాత కోదండం..అతని కొడుకులిద్దరూ మరియు అతని బామ్మర్ది మర్యాదగా పలకరించి ఆప్యాయంగా కూర్చోబెట్టి చిదానందం చెప్పిన అరడజను కథలు ఓపిగ్గా విన్నారు. మధ్యలో నిర్మాత కోదండం వయసైపోయిన కారణంగా భారీకాయం కావడం వల్ల నిద్రొచ్చి గుర్రుపెట్టాడు. కానీ అత్యంత ఆసక్తిగా కోదండం కుమారులిద్దరూ తన కథలు విని 'భలే భలే' అని మెచ్చుకొని చిదానందం భుజం తట్టి కబురుపెడతామని మాటిచ్చారు. తనకు అవకాశం గ్యారంటీగా గ్యారంటీ అనే సంతోషంతో చిదానందం 'యాహూ' అంటూ ఒకే ఒక్క గెంతు వేసి సరాసరి తన వూళ్ళోకొచ్చిపడ్డాడు. కనిపించిన వాళ్ళందరికీ విసుగనిపించకుండా చెప్పి చెప్పి దూరపు వాసులందరికీ వివరంగా ఉత్తరాలు రాసి మరీ తన కథలు ఆహా ఓహో బ్యానర్‌లో సినిమాలుగా రాబోతున్నాయని టాం టాం చేసాడు.

★ ★ ★

## ప్చ్! అంత్రా!

**మోడలింగ్ నుంచి బాలీవుడ్‌లోకి వచ్చిన అంత్రా మాలికి రామ్‌గోపాల్ వర్మ సినిమాల్లో వరసగా అవకాశాలు రావడంతో అందరి దృష్టిలోకీ వచ్చింది. అయితే తనకంటూ గుర్తింపుని తెచ్చే సినిమా ఒక్కటీ లేకపోయింది.**

**అలాంటి టైములో 'మై మాధురీ దీక్షిత్ బన్నా చాహ్‌తీ హూ' లాంటి వెరైటీ సినిమాలో అవకాశం రావడంతో ఎగిరిగంతేసింది అంత్రా. కానీ ఈ సినిమాని అంతా బావుందీ అన్నారు కానీ ఆమె కెరీర్ ఎలాంటి మేలూ చేయలేకపోయింది. అందుకనే ఇప్పుడు మాంఛి హిట్టు కోసం ఆశగా ఎదురుచూస్తోంది అంత్రా.**



ఆర్నెల్లు గడిచాయి. సంవత్సరం గడిచింది. రెండేళ్ళు కావొస్తోంది. చిదానందానికేమీ పిలుపురాలేదు. అసలు తన కథతో ఏ చిత్రమూ ప్రారంభమవుతున్న దాఖలాలు లేవు. ప్రతీ దిన పత్రిక ప్రతీ సినివార పత్రిక మరియు టీవీలో సినిమా షూటింగ్ విశేషాలు ఫాలో అవుతున్నాడు. కానీ ఎక్కడా తన కథతో కోదండం సినిమా తీస్తున్నట్లు న్యూసే లేదు.

ఇదిలా ఉండగా-

మరోవైపు కోదండం మాత్రం ఈ రెండేళ్ళలోనూ వంద సినిమాలు పూర్తి చేసేస్కున్నాడు. ఇది ప్రపంచంలోనే రికార్డుగా నమోదు కాబడి గిన్నీస్ బుక్కులోకి కోదండం పేరు వంద చిత్రాల నిర్మాతగా ఎక్కబోతోంది. ఎన్ని సినిమాలు తీసినా తరగని కోట్ల సొమ్మున్నది కనుకనే కోదండం తమిళంలో మళయాళంలో తెలుగులో కన్నడంలో మరాఠీలో బెంగాలీలో పంజాబీలో ఇలా అనేక భాషల్లో ఈ రెండేళ్ళ కాలంలో టకటకా ముప్పయి సినిమాలు నిర్మించాడు. ఈ ముప్పయి ఇది వరకు డెబ్బయి కలిసి వెరసి నూరు చిత్రాలు తీసిన మొట్టమొదటి ప్రపంచ రికార్డు సాధించి సినీ నిర్మాతగా అందరి ప్రశంసలతోపాటు గిన్నీస్ బుక్కులో ప్లేసు సంపాదించాడు. ఇక్కడ సంపాదించాడు అనే కన్నా కొట్టేసాడు అనడం సబబుగా వుంటుందేమో. ఎందుకంటే..

95 సినిమాలు పూర్తిచేసి తనకి పోటీగా ఎప్పట్నుంచో సినిమాలు తీస్తూ వస్తున్న 'అయ్యో...కుయ్యో' ప్రొడక్షన్స్ అధినేత బాగా సీనియర్ అయిన బడా సినిమా నిర్మాత బ్రహ్మాచలం గిన్నీస్ బుక్కులోకి ఎక్కేందుకు చాలా దగ్గరగా వున్నాడని గుర్తించి ఆ స్థానం అతనికి దక్కకుండా తనే చేజిక్కించుకోవాలంటే ముందుగా తమ సంస్థ నుంచి ఓ ముప్పయి చిత్రాలు త్వర త్వరగా నిర్మించి తీరాలనేది కోదండం ఎత్తుగడ. బ్రహ్మాచలానికి కేవలం ఐదు సినిమాలు చాలు. అవి తీయడానికి బ్రహ్మాచలానికి ఎలా లేదన్నా ఐదేళ్ళు పడుతుంది. ఈలోగా తనే తీసెయ్యాలి. ఏవో చెత్త కథతో సొమ్ముంది కదాని పరాపరా తీసెయ్యడం కాకుండా తన బ్యానర్‌లో గత చిత్రాల నాణ్యతకు ఏమాత్రం తీసిపోని కథలతో చిత్ర నిర్మాణం జరపాలి. ఎలా...ఎలా..పరిశ్రమలో చూస్తే కథలకు బాగా కరువొచ్చేసింది.

ఈ ఆలోచనతో కోదండం ఒక మాస్టర్ ప్లాన్ రూపొందించి చకచకా పావులు కదిపాడు. తొలుతగా సినిమాకి కథ కావలెను అంటూ ప్రకటన ఇచ్చాడు. ఒక్క కథ అడిగితే ఎలా చూసుకున్నా ఓ పాతిక ముప్పయిదాకా గిట్టుబాటవుతాయని కోదండానికి తెలుసు. కానీ వేలాది కొత్త రచయితలొచ్చి ఉత్సాహంగా పాల్గొని కొత్త కొత్త పాయింట్లతో వైవిధ్యమైన కథలు చెప్పడంతో ''ఔరా..కథలు లేక పరిశ్రమ గొడ్డుపోయింది కానీ ఆంధ్ర రాష్ట్రం గొడ్డుపోలేదని..గంగిగోవులాంటి కొత్త కథారచయితలకి కొరత లేదని అర్థమైన వాడై..ఆ కథల్లోంచి సరికొత్త థీమ్స్‌ని విభిన్నమైన మంచి స్టోరీ లైన్లని సంగ్రహించి తన ఆస్థాన విద్వాంసులతో సరికొత్త కథలు వండించాడు. ఓ మూడొందల సినిమాల వరకూ ఢోకా లేని కథలు దొరికాయి.

అందులోంచి మేలైన వాటితో లోబడ్జెట్టు టీనేజ్ లవ్ స్టోరీలూ హాస్య కుటుంబ కథలతో ముప్పయి సినిమాలు ఏకకాలంలో వివిధ భాషల్లో తనకున్న నెట్‌వర్క్‌తో కొత్త దర్శకులనూ కొత్త నటీనటులను పెట్టి తీసిపారేశాడు.

ఇంకేముంది..? శత చిత్ర నిర్మాతగా గిన్నీస్ బుక్కులో పేరూ...ఎన్నో సన్మానాలూ..అధికార పార్టీ యిచ్చిన రాజ్యసభ సీటూ..గోల్‌మాల్ రాష్ట్రంలో గోవిందా యూనివర్శిటీ యిచ్చిన గౌరవ డాక్టరేటూ..కోదండం పంట పండింది.

ఇది నా కథలా వుందే..అని ఏ రచయితకూ అనుమానం రాకుండా పోల్చుకోలేని విధంగా టైటిల్స్‌లో కథ అన్న చోట ''ఆహా ఓహో యూనిట్'' అని వేసుకుని చాలా తెలివిగా ఏ ఫిర్యాదులూ రాకుండా జాగ్రత్త పడ్డాడు కోదండం.

మిగతా కథలలో తన కొడుకులూ..బామ్మర్ది పెట్టబోయే కొత్త బ్యానర్‌లో సినిమాలు తియ్యడానికి భవిష్యత్ పథకాలు సిద్ధం చేసాడు. ఆ కథలు ఎలాగూ మరో దశాబ్దం దాకా సరిపోతాయి కూడా.

★ ★ ★

పాపం మన చిదానందం మాత్రం పెద్ద భూతద్దం ఒకటి కళ్ళముందెట్టుకుని కోదండం తీసిన ప్రతి సినిమాకీ వెళ్ళి నేల క్లాసులో కూర్చొని తదేకంగా చూస్తూ..తన కథ ఎక్కడైనా కన్పిస్తుందేమోనని టైటిల్స్ దగ్గర్నుంచీ శుభం కార్డు వరకూ ఒక పక్క ఇంకా ఆశగా వెతుకుతూనే మరోపక్క 'సినిమాకు కథ కావలెను' అనే ప్రకటన కోసం మళ్ళీ మళ్ళీ ఎదురుచూస్తూ తీవ్రంగా ప్రయత్నిస్తూనే వున్నాడు.

చిదానందం ఆశ ఫలిస్తుందంటారా? ఎప్పటికైనా అతని ప్రయత్నం నెరవేరుతుందా? ఏమో! అయినా ఈ విషయంలో మనం మాత్రం ఏం చెయ్యగలం చెప్పండి. కోదండం లాంటి వాళ్ళకో దండం పెట్టి ఊరుకోమని హితవు చెప్పడం తప్ప..ఏమంటారు?

అయినా..మన పిచ్చిగాని మనలాంటి వాళ్ళ మాట ఇలాంటి వాళ్ళు వింటారా..?!